# చినిగిన చీర

కె. తాయారమ్మ

చినిగిన చీరను కుట్టుకుంటూ వీధివైపు చూపులు సారిస్తోంది పద్మాక్షమ్మ.

నాలుగు రోజులై ఇలాగే చూస్తోంది. వారం రోజుల క్రితమే రావలసిన పెద్దకొడుకు ఎందుచేత రాలేదో?

'వెర్రినాగన్న, ఒంట్లో నలతగా వుందో ఏమో? లేకపోతే అనుకున్న రోజుకంటే ఓపూట ముందుగానే వస్తాడు.'

ఇక్కడ చిన్నకొడుకు వంతయిపోయింది.

అప్పుడే కొడుకూ కోడలు ముఖాలలో రంగులు మారుతున్నాయి. చీటికీ మాటికీ పిల్లి మీద పెట్టి, గడ్డ మీద పెట్టిసూటిపోటి మాటలంటున్నారు.

క్షణక్షణం మనస్సు అదోలా అయిపోతోంది.

కడుపున పుట్టిన బిడ్డలు క్షణం అటూ ఇటూ అయితే తన ఉనికినే భరించలేకపోతున్నారు. తను మాత్రం వాళ్ళు ఇరవై నాలుగు గంటలూ తన కళ్ళముందే వుండాలని కోరుకుంటోంది!

ఎంత వ్యత్యాసం?

అందుకే అన్నారుకాబోలు ''రాయి వంటి బిడ్డ, లక్క వంటి తల్లి!' అని!

''ఇవాళ కూడా అన్నయ్య రాలేదా?'' అంటూ లోపలికి అడుగుపెట్టాడు చిన్నకొడుకు శివరాం.

''రాలేదు!'' అంది ముక్తసరిగా.

''నేనేదో జమీందారునైనట్టు, వాడేమో బికారివాడైనట్టూ భావిస్తున్నాడు అన్నయ్య! నేను కూడా ఇద్దరి పిల్లల్ని పెంచి పెద్దచేసుకోవాలి!'' అంటూ రుసరుసలాడేడు శివరాం.

చేతిలో సూది గుచ్చుకోగా 'అమ్మా' అంది పద్మాక్షమ్మ. కన్నీళ్ళు ఉబకడానికి సిద్ధంగా వున్నాయి.

''చింకి గుడ్డలు కుట్టుకుంటూ కూచోవద్దని ఎన్నిసార్లు చెప్పాను! నీ పెద్ద కొడుకు వచ్చేసరికి నీ తమ్ముడు నాకు చీరలు కొనలేదు అని చెప్పడానికేగా?''

పద్మాక్షమ్మ మాట్లాడలేదు.

'తను చీరలు కావాలంటోందా?'

తనకి కావలసింది పిసరంత మమత! చీరలు కాదు! కాని వాళ్ళు దాన్ని తనకి ఇవ్వలేరు!

బిడ్డ క్షణం ఆలస్యంగా ఇంటికొస్తే భరించలేని బేల హృదయం తనది. అనుకున్న కంటే ఎక్కువ కాలం [illegible] భరించలేని స్వార్థపూరిత హృదయం బిడ్డది.

ప్రవాహం కిందకే ప్రవహిస్తుంది. కాని మీదికి వెళ్ళదు. తన బిడ్డలు తనకి కావాలి! వాళ్ళ బిడ్డలు వాళ్ళకి కావాలి! రేపు వాళ్ళ



బిడ్డలు కూడా ఇలాగే ప్రవర్తిస్తే?... వాళ్లు కూడా తనలాగే బాధపడతారా? వాళ్ళ ఆవేదన చూడడానికి అప్పుడు తనుండదు!

కా...ని... వాళ్ల అంతరంగపు అట్టడుగు పొరల్లో ఏ మూలైనా ఇంగితం అనేది వుంటే పశ్చాత్తాపంతో కృంగిపోతారు! లేదా జీవితంతో రాజీపడతారు!

చీరను ఒంటికి చుట్టుకునే ఇంతవరకూ చిరుగులకి కుట్లు వేసింది."ఒంటికి కట్టుకున్న చీరకు కుట్లెయ్యకూడదే కోడలా"అనేది అత్తగారు! కాని ఇప్పుడెలా కుదురుతుంది? ఉన్న రెండు చీరలూ చాకలికేసి సంచిలో పెట్టుకుంది ఏ క్షణంలో పెద్దకొడుకు వచ్చి తనని తీసుకువెళ్తాడోనని!

కానీ ఇంకా వాడు రాలేదు!

లోపలి నించి కోడలి మాటలు వినిపిస్తున్నాయి - ''చూడండి తల్లిని పోషించవలసిన బాధ్యత కొడుకికి వుంది! కాని మీరొక్కరే కాదుగా? మీ అన్నయ్య గడుసుతనం చూస్తూవుంటే నాకు మహామంటగా వుంది!''

''నాలుగు రోజులు ఓపికపట్టు శాంతీ! నేనే వెళ్ళి అమ్మని అన్నయ్య దగ్గర దించి వస్తాను''

మరోసారి సూది గుచ్చుకుని ప్రాణం జిల్లుమంది.

''పెద్దాడెప్పుడొస్తాడో?''

మరో రెండ్రోజులు గడిచాయి.

ఈలోగా మూతివిరుపులు, ముఖం చిట్లింపులు, హృదయంలో సన్నని బాధ మెలితిరిగింది.

తను కట్టుకున్న చీర మరోచోట చిరిగింది. మళ్లీ సూదీదారం తీసుకుంది. వీథివైపు చూపులు సారిస్తూనే కుడుతోంది.

ఉన్నట్టుండి పెద్దకొడుకు ఊడిపడ్డాడు.

పద్మాక్షమ్మ కళ్లు ఆనందంతో వెలిగాయి.

''పెద్దాడా బాగున్నావా? కోడలూ, పిల్లలూ బాగున్నారా?''



పలకరించింది.

''ఆ అందరూ బాగున్నారు! గీతకి పెళ్ళి కుదిరింది. ఆ హడావిడిలో వున్నాను! రావడం వారం రోజులు ఆలస్యమైంది!''

''బావగారూ బాగున్నారా? ఇందండి మంచినీళ్లు!'' శాంతి వచ్చి అంది.

చిన్న కోడలు శాంతి అసలేమీ జరగనట్లే ప్రవర్తిస్తోంది! కొందరికి నటన కూడా పుట్టుకతోనే వస్తుందేమో?

''అమ్మా చీరలు లేవా! పాత చీర కుట్టుకుంటున్నావు?'' నోటి దగ్గర మంచినీళ్ళ గ్లాసు పెట్టుకుంటూ అడిగాడు పెద్దకొడుకు పరమేశం.

నేల చూపులు చూసింది పద్మాక్షమ్మ.

నేను అనుకుంటూనే వున్నాను ''అన్నయ్య ఇలా అడుగుతాడని, నువ్వు నింద మా నెత్తి మీద రుద్దుతావనీ! ఇన్నాళ్లూ మేం నిన్ను పువ్వులలో పెట్టి చూసుకున్నాం! అదంతా బూడిదలో పోసిన పన్నీరయింది'' చిన్నకొడుకు రుసరుసలాడాడు.

''ఇప్పుడు నేనేమన్నాను తమ్ముడూ?'' అని, ''అమ్మా! నువ్వు బయలుదేరు. ట్రైన్‌కి టైమవుతోంది!'' అన్నాడు పెద్దకొడుకు.

ఆ ఇద్దర్నీ మార్చి మార్చి చూసి చేతిసంచి తీసుకు బయలుదేరింది పద్మాక్షమ్మ.

ఆమె అంతరంగం మార్పుని కోరుతోంది.

రైలు బండితోపాటు ఆమె ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి. ముగ్గురు బిడ్డలు, ముచ్చటైన సంసారం తమది. పిల్లల బాధ్యతలు తీరాయి. హాయిగా, సుఖంగా జీవితం గడపొచ్చు! అనుకున్న తరుణంలో భర్త గుండెపోటుతో మరణించాడు.

కొడుకులిద్దరూ తనని వంతులు వేసుకున్నారు. మూడేళ్ళయి తను ఇక్కడా అక్కడా తిరుగుతోంది! ఎప్పుడైనా తను కూతురి దగ్గరకెళ్తే ఆమె అంటుంది, ''అమ్మా! మీ అల్లుడుగారు చాలా మంచివారు! నా దగ్గర నువ్వుంటే నాకేమభ్యంతరం లేదు! కాని కొడుకులుండగా కూతురింట్లో వుండడం ఏం సబబు చెప్పు?''

సున్నితంగానే తనని వద్దన్నది.

తన 'ఈ మార్పులో రెండు మూడు రోజులు సరదాగానే గడుస్తాయి. తరువాత కక్ష సాధింపు చర్యలు!

ప్రతీ స్త్రీ మాతృత్వాన్ని కాంక్షిస్తుంది! కాని... కాని... ఇలాంటి భవిష్యత్తుని ఊహించదేమో? ఇదే వింత! అన్నీ తెలిసీ మానవుడు మళ్ళీ మొదటికే వస్తాడు! తప్పని తెలిసీ తప్పు చేస్తూ వుంటాడు!

రైలు ఒక్క కుదుపుతో ఆగింది.

తనని రెండు ముక్కలుచేసి పంచుకున్న కొడుకులిద్దరిలో పెద్దకొడుకు వంతుకి చేరింది.

పలకరింపులూ అవీ అయ్యాయి. పెద్దకోడలు మమత ఆరాలు తీసింది. "ఏం ఇన్నాళ్ళున్నారు. మీ చిన్నకోడలు ఒక్క చీరన్నా కొనిపెట్టలేదా?'' అని.

తను నవ్వి ఊరుకుంది.

"పాతవో కొత్తవో నేనైతే నాలుగు చీరలు ఇస్తానుకాని, ఆ మహారాణి ఒక్క చీరన్నా ఇవ్వలేదంటే ఆశ్చర్యంగా వుంది. నాలా స్వార్థం లేకుండా ఎవరైనా వుంటారా? ఆ పాత చీరలు నాలుగూ పడేస్తే చక్కటి స్టీలు డబ్బా వస్తుంది! కోడలి వాగ్ధాటి ఇలా సాగిపోతోంది.

కొన్ని నెలల సంగతి గుర్తొచ్చింది పద్మాక్షమ్మకి.

చిన్న కొడుకు దగ్గరకెళ్ళిన కొత్తలో పెద్ద కోడలిచ్చిన పాత వెలిసిపోయిన పువ్వుల పాలిస్టర్ చీర కట్టుకుని అక్కడికి దగ్గరలో వున్న వెంకటేశ్వరస్వామి గుడికెళ్లింది ఏదో పురాణం జరుగుతోందని. అక్కడ వాళ్లందరూ తనని చూసి అదోలా నవ్వారు.

తన మనస్సు చివుక్కుమంది.

వాళ్ళందరూ తన వయస్సు వారే!

కంచి, మధుర, ధర్మవరం చీరలు కట్టుకొచ్చారు. అలాంటివి వాళ్ల కొడుకులు కొంటారు కాబోలు.

తనతో వచ్చిన మనవడు తల్లితో ఏం చెప్పాడో ఏమో? "ఏళ్లు రాగానే సరా. కొంచెమైనా ఇంగితం వుండొద్దూ?" అంటూ ఆ పాత చీరలు నాలుగూ స్టీలు గిన్నెలవాడికి వేసి యాభై పైసల రిబేటులో రెండు చీరలు కొని పడేసింది చిన్నకోడలు శాంతి.

నీళ్లలో ముంచగానే రెండు చీరలూ చినిగిపోయాయి. మళ్లీ సూదీదారం మొదలు. కుట్టుకోడం, చీవాట్లు తినడం. ''నానమ్మా నీకెలాంటి చీర కావాలి?'' అంటూ వచ్చింది మనవరాలు గీత.

దాని మొహంలో పెళ్లికళ ఉట్టిపడుతోంది.

''ఏం నువ్వు కొనిస్తావా?'' అంటూ నవ్వింది తను.

''కాదు నాన్న కొంటారు'' అంది

"ఎలాటిదో ఒకలాంటిది. నువ్వు వెయ్యికాలాలు పిల్లపాపలతో సుఖంగా వుంటే నా కంతే చాలు! అంది కన్నులలో ఆనందబాష్పాలు కదలాడుతుండగా.

ఆ పిల్ల వెళ్లిపోయింది ఉత్సాహంగా.

ఆ మరునాడు పెద్దకోడలు ఓ చీర తెచ్చి అందించింది.

దాన్ని విప్పి చూసింది పద్మాక్షమ్మ. ముతకగా వుంది. రెండు పక్కలా ఎర్రటి అంచు వుంది. ఇదా తను మనవరాలి పెళ్లికి కట్టుకోబోయే చీర?

ఆమెకు ఉక్రోషం ముంచుకొచ్చింది.

ఇలాంటి చీర పనిమనిషి కూడా పుచ్చుకోదు! తను బిడ్డల కోసం ఎంతో త్యాగం చేసింది. తన మగపిల్లలు చదువులకి వచ్చి స్కూల్ ఫీజులకి, పుస్తకాలకీ డబ్బు చాలదేమో అని మంచి చీరలు కొనుక్కోకుండా సాదా చీరలే కొనుక్కుంది!

తరువాత ఆడపిల్ల ఎదిగొచ్చింది; "వయసులో వున్న దానికి మంచి చీరలుండాలి కాని తనకెందుకు? ఏది కట్టుకున్నా పోతుంది" అని అప్పుడూ సాదా చీరలే కొనుక్కుంది.

కాని... కాని... వాటన్నిటినీ తన ఇష్టప్రకారం పద్దసుకుంది. ఎవరూ నీకు ఇలాంటిది వుండాలని నిర్దేశించలేదు.

తన భర్త పోగానే మంచి చీరలన్నీ కోడళ్లకీ, కూతురికీ సరిసమానంగా పంచింది.

అప్పుడు వాళ్లు సంతోషించనూ లేదు, విచారించనూ లేదు. ఆ ఇంక ఆవిడ ఇలాంటి చీరలు ఎలా కట్టుకుంటారు? అని తేల్చిపారేశారు.

తనిప్పుడు బరువు చీరలు కట్టుకోలేకపోతోంది.

ఆమెకు ఒక్క విషయం గుర్తుకొచ్చింది.

''అవధానిగారి భార్య చేరెడు వెడల్పున్న తెల్ల జరీ చీర కట్టుకుని కామాక్షీదేవి ఆలయానికొచ్చారు. ఆ చీర ఎంత బాగుందో!'' అంది భర్తకి భోజనం వడ్డిస్తూ.

''ఎంతుంటుంది?'' అన్నాడు భర్త.

''వెయ్యి రూపాయిలట!'' అంది తను.

ఆ మరునాడే అలాంటి చీర తెచ్చాడాయన.

అది పాతికేళ్ల కిందటి ముచ్చట!

దాన్ని ఎంతో అపురూపంగా దాచుకుంది. ఇవాళ మనవరాలి పెళ్లికి దాన్ని కట్టుకోవాలి!

పాత ట్రంకుపెట్టె తెరిచింది. శిథిలావస్థలో వున్న చీరని బైటికి తీసింది. సూదీదారం చేతిలోకి తీసుకుని దాన్ని కుట్టసాగింది.


ఇంతలో వచ్చారు ముగ్గురు పిల్లలు, కోడళ్లు, అల్లుడూ. ''అమ్మా! నీకేం తక్కువైందని మళ్లీ పాత చీరకి చిరుగులు కుట్టుకుంటున్నావు?'' అన్నారు మూకుమ్మడిగా.

పద్మాక్షమ్మ వాళ్ళవైపు చూసి వేదాంతిలా నవ్వింది.

''పిల్లలూ చినిగిన చీరకు కుట్లు వేసి కట్టుకోవచ్చు! కాని చినిగిన మనసులకి కుట్లు వేయడానికి ఏ సూదీ దారం పనికిరాదు!'' అంటూ అట నుండి కదిలింది పద్మాక్షమ్మ.

వాళ్లందరూ నిశ్చేష్టులై చూస్తూ వుండిపోయారు. ◐

## అమెరికాలో హింస, దౌర్జన్యం, సెక్స్ విశృంఖలం



అమెరికా దేశంలో యువత విశృంఖలంగా విహరిస్తోందని, లైంగిక స్వేచ్ఛ అవధులు మించిపోతుందని అమెరికన్ల గురించి అన్ని దేశాలవారూ అనుకున్నారు. అమెరికన్ చిత్రాలలో గంటకు వంద హింసాత్మక దృశ్యాలు వుంటున్నాయని ఒక సర్వేలో తేలింది. అమెరికాలో కొంతమంది కుర్రవాళ్ళు చేతి ఖర్చుల కోసం వ్యభిచారం చేస్తే, మరికొందరు ఇంట్లో నుండి పారిపోయి వచ్చి పూట గడవక ఇలాంటి నీచ కార్యాలకు పాల్పడుతున్నారు. అమెరికాలో అన్ని పుస్తకాల షాపులలో స్త్రీల నగ్న చిత్రాలు, సెక్స్ పుస్తకాలు, బ్లూ ఫిల్మ్ కేసెట్లు విచ్చలవిడిగా అమ్ముతుంటారు. అమెరికా పరిశోధకుడు కిన్సే వ్రాసిన 'సెక్సువల్ బిహేవియర్ ఆఫ్ హ్యూమన్ ఫిమేల్' అనే గ్రంథంలో అమెరికన్ల విచ్చలవిడితనాన్ని కన్నుల కట్టినట్టు వివరించారు. అమెరికాలో హింస, సెక్స్ ఎలా వుందంటే ప్రతీ 30 సెకన్లకు ఒక తుపాకీ అమ్ముడవుతోంది. ప్రతీ 30 నిముషాలకు ఒక హత్య జరుగుతోంది. ప్రతీ ఆరు నిముషాలకు ఒక మానభంగం జరుగుతోంది. ప్రతీ 45 సెకన్లకు ఒక దౌర్జన్యం, ప్రతీ 8 సెకన్లకు ఒక ఇంటి దోపిడీ జరుగుతోందని పోలీస్ రికార్డులే తెలియజేస్తుండగా పోలీసుల దృష్టికి రాని ఈ అకృత్యాల లిస్ట్ ఎలా వుంటుందో ఊహించుకోండి.

- వర్మ


**తెల్లమచ్చలు**

అత్యంత శీఘ్రంగా, ప్రభావశీలియైన మందుతో తెల్ల మచ్చరంగు మారి, నెమ్మదిగా శరీరంలో మచ్చ లేర్పడు కారణం దూరం చేస్తూ, కల్సిపోవును. పరీక్షించుటకు 7 రోజుల మందు ఉచితంగా పంపుతాము. ఇతర వైద్యాలతో నిరాశ చెందినచో, మాకు రోగి వయస్సు మచ్చల వివరాలతో వ్రాయండి.

**జుట్టు తెల్లబడుట, రాలుట**

చిరుప్రాయంలో జుట్టు రాలుట, తెల్లబడుటను నివారించుటకు, విలువైన వన మూలికలతో చేయబడిన మందు కలదు. నల్లని ఒత్తైన జుట్టు దట్టంగా పెరిగి, జ్ఞాపకశక్తి పెరిగి మెదడును చల్లబర్చును. రోగి వయసు, వివరాలతో వ్రాయండి.

**జ్ఞాపకశక్తి**

మేము తయారు చేసి ఇచ్చు మందుల వల్ల మెదడు, తల, కళ్ళు చల్లగా యుండి, జ్ఞాపకశక్తి పెరిగి, విద్యార్థి చురుకుగా ఉండును.

వాత రోగం, మధుమేహం లావు తగ్గుట, ఇతర చర్మరోగములు, స్త్రీ పురుష గుప్తరోగములకు సంపూర్ణ చికిత్స కొరకు వివరములుగా వ్రాయండి.

**BHUSHAN CHIKISTALAYA (రిజి.)**
**P.O. KATRI SARAI ( GAYA ) - 805 105**